# లీవ్

-నరసింహమూర్తి



శ్యామలరావు నాలుగయిదు కంపెనీలలో పనిచేశాడు. అన్ని చోట్లా అతనికెన్నో చేదు అనుభవాలు ఎదురయినా 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అనుకుంటూ అన్నీ జీర్ణంచుకుపోతున్నాడు. మొదట ఒక కంపెనీలో చేరినప్పుడు అనుకోకుండా మ్యారేజ్ ఫిక్స్ అయినట్టు లెటరొచ్చింది. అసలే అవి ఇయర్ క్లోజింగ్ డేస్. పని ఊపిరాడకుండా వుంది. ఐదారు నెలల వరకు ముహూర్తాలు బాగోలేకపోవడం వల్ల పెళ్ళి కూడా ముంచుకొచ్చింది.

శ్యామలరావు బాస్‌కు నలభై ఏళ్ళొచ్చినా పెళ్ళి చేసుకోలేదు. ఎవరైనా పెళ్ళంటూ శుభలేఖ ఇచ్చినా దాన్ని చూసి చూడనట్టు ప్రక్కన పడేసేవాడు.

'ఇప్పుడెందుకు చేసుకుంటున్నావ్? . ఆఫీస్‌లో ఒక్కడికీ బాధ్యత లేదు. కంపెనీ ఏమయిపోయినా వాళ్ళకనవసరం. అభివృద్ధిలోకి రావాలంటే ఎవరైనా కొంతవరకు సొంత పనులు ప్రక్కన పెట్టాలయ్యా. వచ్చి సంవత్సరం కాలేదు. అప్పుడే తగుదునమ్మా అంటూ పెళ్ళి. సరే. నువ్వేమయినా చేసుకో. నాలుగు రోజులు కన్నా ఎక్కువ లీవ్ ఇవ్వను' అంటూ లీవ్ లెటర్‌ని ప్రక్కన పడేసాడు బాస్.

స్నేహితుల పెళ్ళికే నాల్గయిదు రోజులు సెలవు పెట్టేస్తారు కొంత మంది. తన సొంత పెళ్ళికి అందులో ఒక రోజు రాను, ఒక రోజు పోను - రెండు రోజులు దానికే సరిపోతుంది. అంటే పసుపు బట్టలతో ఆఫీసుకు వచ్చేయాలన్నమాట. పెళ్ళి తరువాత గృహ ప్రవేశం బదులు ఆఫీసులో నేరుగా ప్రవేశించి కుడికాలు పెట్టి లోపలికి రావటం ఒక్కటే తక్కువ. శ్యామలరావుకు అంతా అయోమయంగా వుంది.

అసలిప్పుడు పెళ్ళి ముహూర్తం పెట్టినందుకు తల్లిదండ్రుల్ని తనివితీరా తిట్టుకున్నాడు.

ఇదిలా వుండగా అదే కంపెనీలోని మిగిలిన జనం తుమ్ముకు, దగ్గుకు సెలవు పెట్టడం, ఏదో శాస్త్రం చెప్పినట్టు పిల్లి సంవత్సరాదిందని చెప్పి సెలవు పెట్టినట్టు ఇష్టానుసారం జరిగిపోతుంది. పెళ్ళాం డెలివరీ అని కొందరు, టెలిగ్రామ్‌లు తెప్పించుకుని కొందరు, ఆడవారయితే మా వారు వేరే ఊళ్ళో ఉద్యోగం చేస్తున్నారు నాలుగయిదు రోజులు సెలవు పెట్టి వెళ్తున్నానని ఒకసారి, మా వారు వస్తున్నారంటూ మరోసారి... లీవ్‌ల ప్రసహనం ఇలా సాగిపోతూ వుంటుంది.

సహజంగా శ్యామలరావు చాలా మొహమాటస్తుడు. పై ఆఫీసర్ల దృష్టి లోనూ, మేనేజిమెంటు దృష్టిలోనూ తక్కువయి పోవటం అతనికి ఇష్టం వుండదు. ఆ కారణం చేత అతను సమాజంలోనూ, బంధువుల్లోనూ అంటీ అంటనట్లు ముట్టీ ముట్టనట్లుయి పోయాడు. ఉద్యోగ భయంచేత ఎన్నో కంపెనీలలో పండుగలు, పబ్బాలూ ఏమీ లేకుండా పని చేశాడు. ఎన్ని కంపెనీలు మారినా ఇదే స్థితి. అదేం ఖర్మమో అతను చేరిన నాల్గయిదు రోజులకే అతని పైనున్న వాళ్ళు సెలవు పెట్టేస్తారు. ప్రతి సంవత్సరం జనవరి వస్తోందనగానే కేలండర్ ముందేసుకుని లీవ్‌ల పేరిట కేలండరంతా పంచుకునే వాళ్ళు కొంత మంది. శ్యామలరావనే వ్యక్తి ఒకడున్నాడని, వాడికి ఆశలు, ఆశయాలు ఉంటాయని, విశ్రాంతి అవసరమని, మిగిలిన వాళ్ళెందుకు గ్రహించటంలేదు? ఒక్క రోజు లీవ్ పెట్టటానికి రాత్రంతా అంతర్మధనం ఎందుకు పడుతున్నాడు? అతనెక్కడికి వెళ్ళడని, ఆదివారాలు, సెలవు రోజుల్లో రమ్మన్నా కూడా కుటుంబాన్ని వదిలి వచ్చేస్తాడని అందరి నమ్మకం. అందుకే లోకువ కట్టేసి ఎవరి పబ్బం వాళ్ళు గడువుకుంటున్నారు.

ఆ రోజు శ్యామలరావు భార్య 'ఈ వేసవి కాలం వారం రోజుల పాటు షిర్డీ వెళ్ళొద్దామండీ. ముందుగా సెలవు పెట్టేయండి. బొత్తిగా నోట్లో నాలికలేని వాళ్ళుగా ఉండకండి' అంటూ వారం రోజులుగా పోరు సాగిస్తోంది.

'మన షిరిడీ ప్రయాణం కాన్సిల్' అన్నాడు శ్యామలరావు రాత్రి ఆఫీసు నుంచి ఇంటికొస్తూ.

శ్యామలరావు భార్య అర్థం చేసుకుంది ఈసారి కూడా ఎవరో ముందే వేసవి కాలాన్ని పంచేసుకున్నారని.

ఆ రోజు శ్యామలరావు ఉత్సాహంగా ఇంటికొచ్చాడు. ఆ సంవత్సరం ప్రమోషన్ వచ్చిన వాళ్ళల్లో అతనూ ఉన్నాడు. జీతం ఆరు వందలు పెరిగింది. ఆ రోజు రాత్రి భార్యాభర్తల మధ్య సంభాషణ ఇలా సాగింది.

'వాళ్ళెవరో లీవ్ తీసుకుని ఎంజాయ్ చేస్తున్నారు - మనం అనుభవించ లేకపోతున్నాం అనుకోకూడదు. ఎక్కువ సెలవులు పెట్టటం వల్ల దుబారా ఖర్చు పెరుగుతుంది. అనవసరమైన ప్రయాణాలు ఎక్కువవుతాయి. మేనేజిమెంట్ దృష్టిలో పేరు తెచ్చుకోవటానికి అవకాశం వుండి కూడా అనర్హులుగా మారటం, తద్వారా చాలీచాలని జీతాలతో భవిష్యత్తులో ఏమాత్రం ప్రణాళికలు రూపొందించుకోలేక పోవడం... అయినా ఈ పోలికలు పోటీలు ముఖ్యంగా కష్టపడడంలో తప్ప ఎవ్వరితోనూ ఏ విధంగాను పెట్టుకోకూడదు' అనుకున్నారిద్దరూనూ.

ఎప్పుడూ లీవ్‌లు పెట్టని శ్యామలరావు ఇంకెప్పుడూ దాని గురించి ఆలోచించలేదు.